గుడ్లు తేలేస్తున్నారు..!



పిట్టలవేమవరంలో కోళ్లఫారం



కోళ్లు మృతి చెందడంతో కళా విహీనంగా మారిన తీపర్రు ఫారం

- బర్డ్‌ఫ్లూతో కుదేలైన కోళ్ల పరిశ్రమ
- కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నా వినియోగించని ప్రజలు
- ఎగుమతులు లేక నష్టాలు చవి చూస్తున్న యజమానులు
- నియోజకవర్గంలో నిత్యం 25 లక్షల మేర ఉత్పత్తి

పెరవలి: బర్డ్‌ఫ్లూ దెబ్బకి కోళ్ల పరిశ్రమ కుదేలయ్యింది. ఈ వ్యాధి సోకిన కోళ్లు గంట తిరగకుండానే మృతి చెందడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. గతంలో ఇటువంటి పరిణామాలను ఎదుర్కొని ఈ పరిశ్రమ నేడు గడ్డు స్థితిలోకి వెళ్లింది. జిల్లాలో దాదాపు 1.50 కోట్ల కోళ్లు ఉండగా వీటిలో సుమారు కోటికి పైగా బర్డ్‌ఫ్లూ బారిన పడి మృత్యువాత పడ్డాయి. పెరవలి మండలంలో 4.08 లక్షల కోళ్లు ఉండగా వీటిలో 2.50 లక్షల కోళ్లు ఈ వ్యాధి బారిన పడ్డాయి. ప్రస్తుతం మిగిలి ఉన్న కోళ్లకు ఈ వ్యాధి సోకకపోయినా ప్రజల్లో చికెన్, కోడిగుడ్ల పట్ల వ్యతిరేక భావం కలగటంతో వీటి వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. జిల్లాలో మిగిలి ఉన్న కోళ్ల నుంచి ప్రతి రోజు 50 లక్షల గుడ్లు ఉత్పత్తి జరుగుతున్నా వీటిని కొనుగోలు చేసేవారు లేకపోవటంతో కోళ్ల యజమానులు గుడ్లు తేలేస్తున్నారు. ఒకవైపు కోళ్లను మేపటం తప్పటం లేదని, మరోవైపు దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధర లభించక, గుడ్లు ఎగుమతులు లేక అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం కోళ్ల రైతుల పరిస్థితి ముందు చూస్తే గొయ్యి వెనుక చూస్తే నుయ్యి అన్న చందంగా మారింది.

నిడదవోలు నియోజకవర్గంలో..

నిడదవోలు నియోజకవర్గంలో కోళ్ల ఫారాలు 122 ఉండగా వీటిలో సుమారు కోటిపైనే కోళ్లు ఉన్నాయి. ఒక్క ఉండ్రాజవరం మండలంలోనే 80 లక్షల కోళ్లు ఉండగా పెరవలిలో 4 లక్షలు, నిడదవోలు మండలంలో 15 లక్షల వరకు ఉన్నాయి. వీటిలో ఒక్క పెరవలి మండలంలోనే ఎక్కువగా బర్డ్‌ఫ్లూ సోకి 2.50 లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇక బాయిలర్ కోళ్ల ఫారాల్లో మచ్చుకి కూడా కోళ్ల పెంపకం జరగటం లేదు. బర్డ్‌ఫ్లూ సోకి మొత్తం కోళ్లన్నీ మృతి చెందటంతో రైతులు ధైర్యం చేసి మరలా కోళ్ల పెంపకం చేయలేదు. పెరవలి మండలంలో నిత్యం బాయిలర్ కోళ్ల పెంపకం 1 లక్ష వరకు ఉండగా నేడు మచ్చుకు కూడా కనిపించటం లేదు. పశు వైద్యాధికారులు బర్డ్ ఫ్లూ సోకిన ఫారాల నుంచి ఒక కిలోమీటరు పరిధిలో 10 రోజులు పాటు చికెన్, గుడ్లు తినవద్దని ప్రకటించారు. ఈ ప్రకటనతో మిగిలిన చోట్ల సైతం వినియోగదారులు వీటి వాడకాన్ని మానేశారు. ఈ వ్యాధి కేవలం శీతాకాలంలోనే విజృంభిస్తుందని వేసవిలో ఈ వ్యాధి సోకదని తెలిసినా ప్రజలు చికెన్ తినటానికి మక్కువ చూపకపోవటం వలన మొత్తంగా చికెన్ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. అధికారులు జాగ్రత్తలు పాటించి చికెన్, గుడ్లు తినవచ్చని ఎంత చెప్పినా ప్రజలు మాత్రం నమ్మటం లేదు. ప్రజలు ఎప్పుడు చికెన్, గుడ్లు తింటారో అప్పుడే ఈ పరిశ్రమకు వెలుగు వస్తుందని కోళ్ల యజమానులు కోటి ఆశలతో నిరీక్షిస్తున్నారు.

వినియోగం లేక నష్టాలు



కోళ్లు ఉన్నా, కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నా మార్కెట్‌లో ధరలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు వీటికి అయ్యే మేత, విద్యుత్ ఖర్చు, బర్డ్ ఫ్లూ సోకకుండా తీసుకుంటున్న జాగ్రత్తలకు గానూ తడిపిమోపెడు పెట్టుబడి అవుతోంది. అయినప్పటికీ వీటి వినియోగం లేక లక్షల్లో నష్ట పోతున్నాం.

– మండ తాతారెడ్డి, కోళ్లఫారం యజమాని, పిట్టల వేమవరం.

నిర్భయంగా తినొచ్చు



బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫారాల నుంచి ఒక కిలో మీటరు పరిధిలో ప్రజలు వీటిని వినియోగించవద్దని ప్రకటించాం. మిగిలిన ప్రాంతాలల్లో నిర్భయంగా వినియోగించవచ్చని చెబుతున్నాం. చికెన్, కోడిగుడ్లను 75 డిగ్రీల సెంటీగ్రేడ్ హీట్‌లో ఉడికించి తినవచ్చు. దీనివల్ల ఎటువంటి హాని ఉండదు. చికెన్ తీసుకువచ్చినప్పుడు శుభ్ర పరుచుకుని బాగా ఉడికించి తినవచ్చు.

– సీహెచ్ చరణ్, పశువైద్యాధికారి, పెరవలి.

క్లుప్తంగా

వెండి వింజామర సమర్పణ



ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వర్‌కుమార్ శర్మకు వింజామరను అందిస్తున్న దాత సూర్యచంద్రం

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన కనకవల్లి సమేత లక్ష్మీనరసింహస్వామి వారికి ఒక భక్తుడు బుధవారం వెండి వింజామరను సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం, పోతవరం గ్రామానికి చెందిన అతుకూరి సూర్యచంద్రం దంపతులు రూ.29 వేలు విలువైన ఈ వెండి వింజామరను ఆలయ ప్రధానార్చకులు కోడూరి ఈశ్వర్‌కుమార్ శర్మ, సిబ్బంది మన్మధరాజా, పసుపులేటి పండులకు అందజేశారు.

హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభం



హనుమాన్ చాలీసా పారాయణలో భజన మండలి సభ్యులు

నల్లజర్ల: స్థానిక రామకృష్ణ భక్త మందిరంలో 49 రోజుల పాటు నిర్వహించే సప్త సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణ బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఏప్రిల్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. మొదటి రోజు నాలుగు భజన మండళ్ల సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వేదపండితులు నందుల ఆంజనేయ శర్మ, సామవేదం నగేష్‌శర్మ, మణికంఠ సాయి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకుపూజ, గంగ సింధూర పూజ, నరఘోష, శత్రుపీడ నివారణకు మన్యు పాశుపత మహామంత్ర హోమం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ట్యాబ్ బహూకరణ

దేవరపల్లి: యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1970–71 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త బొల్లిన బాపిరాజు సుమారు రూ.60 వేల విలువైన ట్యాబ్, ప్రింటర్‌ను అందజేశారు. తాను చదువుకున్న హైస్కూల్‌ను బుధవారం బాపిరాజు సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాలు, క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. స్కూల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, తక్షణ అవసరమైన ట్యాబ్, ప్రింటర్‌ను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉపాధ్యాయ బృందం బాపిరాజును సన్మానించింది. ప్రధానోపాధ్యాయులు యు.చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సింహాద్రి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థి తిరుపతి ప్రసాద్ పాల్గొన్నారు.

యర్నగూడెం హైస్కూల్‌కు ల్యాప్‌టాప్ వితరణ



బాపిరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దేవరపల్లి: యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1970–71లో ఎస్ఎస్‌సీ చదివిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బొల్లిన బాపిరాజు సుమారు రూ.60 వేల విలువైన ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను అందజేశారు. ఆయన బుధవారం తాను చదువుకున్న హైస్కూల్‌ను సందర్శించారు. అక్కడి సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. స్కూలు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, తక్షణ అవసరమైన ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యు.చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు సింహాద్రి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థి తిరుపతి ప్రసాద్ పాల్గొన్నారు.

చెద నివారణ మందు తాగి వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మద్యానికి బానిసై చెద నివారణ మందు తాగి వ్యక్తి మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఏఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన గెల్లా వెంకటేశ్వరరావు (44) ప్రైవేటు ఎల్రక్టీషియన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య భవానీతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన వెంకటేశ్వరరావు బుధవారం తెల్లవారు జామున ఇంటి సమీపంలో ఉన్న చెద నివారణ మందును తాగడంతో కుటుంబ సభ్యులు అత్యవసర వైద్యం కోసం తరలిస్తుండగా కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. మృతుడి భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యర్నగూడెంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దేవరపల్లి: యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1981–82 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం స్థానిక ఆర్ కన్వెన్షన్ వద్ద జరిగింది. విద్యాభివృద్ధికి కృషి చేసిన హైస్కూల్ స్థల దాతలు స్వర్గీయ బొల్లిన గంగరాజు, సావిత్రమ్మ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనాటి గురువులను సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి బాల్య స్నేహితులు కుటుంబ సమేతంగా వచ్చి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనానికి నాంది పలికి నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నల్లం నాగేశ్వరరావు, తులసి దంపతులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. అలనాటి ముచ్చట్లు, మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. దాదాపు 44 ఏళ్ల అనంతరం తొలిసారిగా కలసిన పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

డ్రెయిన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



వ్యర్థాలు తొలగిన తర్వాత ఇలా..

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు : పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో మున్సిపల్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. పట్టణంలోని గణపతి సెంటర్‌లోని కాపు కల్యాణ మండపం ఏరియాలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ నెల 18న 'నిషేధమా ..నీవెక్కడ' శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి స్పందించారు. పట్టణంలోని డ్రెయిన్‌లలో పూడిక తీసి ప్లాస్టిక్‌ను తొలగిస్తున్నారు. పలు షాపుల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలను ముమ్మరం చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొవ్వూరు: దేచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 11 కేవీ ఐ.పంగిడి ఇండస్ట్రీయల్ ఫీడర్, దేచెర్ల లోకల్, ధర్మవరం, కాపవరం, ఐ.పంగిడి వాటర్ వర్క్స్, త్రివేణి 11 కేవీ లైన్లతో పాటు గౌరీపట్నం ఇండస్ట్రీయల్ ఫీడర్, దుద్దుకూరు ఫీడర్లలలో సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. పట్టణంలో మహా పుష్కరం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 11 కేవీ రౌండ్ రామాలయం ఫీడర్ సరఫరాను ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిలిపి వేస్తామన్నారు. నందమూరు రోడ్డు, అచ్చాయమ్మకాలనీ, మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్ ఏరియా, మెరకవీధిలో వాటర్ ట్యాంక్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్‌కు వచ్చే 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జగన్నాథపురం, కరిచర్లగూడెం, బుచ్చింపేట, రేగులగుంట, సంజీవపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నల్లజర్ల: పోతవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిచిపోతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. ఆ సమయంలో పోతవరం, కృష్ణాయగూడెం, సుభద్రపాలెం పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ ఉండదన్నారు.

యర్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలో..

దేవరపల్లి: యర్నగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 హెచ్‌క్యూ ఫీడర్, 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఆ సమయంలో ఆ ఫీడర్లపై గల గృహ, వాణిజ్య, ఇండస్ట్రియల్ వినియోగదారులకు విద్యుత్ ఉండదని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్

కొవ్వూరు: ప్రజలంతా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రజలంతా బ్యాంకింగ్ సేవల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ముఖ్యంగా ప్రతి వ్యక్తి బ్యాంకింగ్ పోర్టర్‌లో చేర్చబడాలన్నారు. ఆర్థిక నిరక్ష్యరాస్యత కారణంగా సైబర్ నేరాల బారిన పడుతున్నారని అన్నారు. బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు తెలివిగా వినియోగించుకోవాలని సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫెరెన్స్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై జె.ధర్మరాజు మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైన సమయంలో 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెయిల్స్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను నమోదు చేయించుకోవాలని ఏఎల్‌డీ ఎం.శ్రీధర్ సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్డీవో ఏ.హేమ సుప్రియ, ఐసీడీఎస్ పీవో డి.మమ్మి, సూపర్‌వైజర్ ఆర్.విజయలక్ష్మి, ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

వీరన్నబాబు గద్దె ఆలయ ప్రతిష్ఠాపన పూజలు



వేగేశ్వరపురంలో వీరన్నబాబు గద్దె ఆలయం వద్ద పూజలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో వీరన్నబాబు గద్దె ఆలయ పునః ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయం వద్ద ఉదయం నుంచి ఆరాధ్యుల వాసు ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు, హోమాలు నిర్వహించారు. సిద్దా వంశస్తులు, గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. వీభూది పళ్లను ఆలయంలో ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతన ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. గురువారం వీభూది పళ్లతో గ్రామోత్సవం, రాత్రి వీరన్నబాబు సేవ, భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మొరాయించిన సర్వర్లు.. నిలిచిన రిజిస్ట్రేషన్‌లు



కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్న కక్షిదారులు

కొవ్వూరు: సెంట్రల్ సర్వర్ మొరాయించడంతో బుధవారం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సర్వర్‌లు పనిచేయక ఈ–సైన్ కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియకు బ్రేక్ పడినట్లు అధికారులు చెబుతున్నారు. భూములు, ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్ కోసం బుధవారం 30 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సర్వర్లు పనిచేయక పోవడంతో రాత్రి వరకు కక్షిదారులు కార్యాలయం వద్దే పడిగాపులు పడ్డారు. సాయంత్రానికి సర్వర్ పని చేయడం ప్రారంభించడంతో నెమ్మదిగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ కొనసాగింది. రాత్రి పొద్దుపోయేంత వరకు కక్షిదారులు కార్యాలయం వద్ద నిరీక్షించారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ సుందరరావును సాక్షి వివరణ కోరగా సెంట్రల్ సర్వర్ మొరాయించడం కారణంగా రిజిస్ట్రేషన్‌లకు ఆటంకం ఏర్పడిందన్నారు. సాయంత్రం నుంచి పని చేయడంతో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా శివాజీ జన్మదిన వేడుకలు



శివాజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

నిడదవోలు : పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో బుధవారం ఛత్రపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్, ముదునూరు కిషోర్‌రాజ, గుడ్ల గోవిందు, మోర్త సాయి, తొక్కలంక భగవాన్, మానూరి కిషోర్, అత్తిరెడ్డి పండు, టంగుటూరి శ్రీనివాస్, ఛత్రపతి ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు శ్రీకాంత్ ఎంపిక



శ్రీకాంత్



ఎంపికైన రాష్ట్ర జట్టు క్రీడాకారులు

నల్లజర్ల: ఆంధ్ర పురుషుల కబడ్డీ జట్టులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన జి.శ్రీకాంత్ ఎంపికై నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 3వతేదీ నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్టణంలో 20 మంది ప్రాబబుల్స్‌కు శిక్షణ జరిగినట్టు శ్రీకాంత్ తెలిపారు. దీనిలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది జట్టులో 12 మందిని ఎంపిక చేశారన్నారు. వారిలో మన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జి.శ్రీకాంత్ ఎంపికైనట్టు చెప్పారు. వీరు ఈనెల 20న ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరుగనున్న 71వ జాతీయ పురుషుల కబడ్డీ పోటీల్లో మన రాష్ట్రం తరఫున ఆడతారన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, సీనియర్ క్రీడాకారులు కోటహరి ప్రసాద్ రెడ్డి తదితరులు శ్రీకాంత్‌ను అభినందించారు.

వెల్లంకికి అభినందనలు



వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న కార్యకర్తలు, నాయకులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల కన్వీనర్‌గా ఎంపికైన వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యంను బుధవారం వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా వెల్లంకి మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మండలంలోని కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఆయన ఆశయాలను మనమంతా కలసి పాటించాలన్నారు. మనం అధికారంలో లేమని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే శక్తి అందరికీ ఉంటుందన్నారు. ఆయా గ్రామాల కార్యకర్తల ద్వారా గ్రామాలలో ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణం పరిష్కారమయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకలు అందించేందుకు మన నాయకుడు జగనన్న ఇచ్చే ప్రతి పిలుపునకు మనమంతా తక్షణం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, నక్కాపండు, చినీంన నాగూయాదవ్, శెనగన సతీష్‌గౌడ్,తాడిగడప శ్రీనివాసరావు,బోడిగడ్ల రాంబాబు,అందుగుల వెంకటేశ్వరావు,అచ్యుత వెంకటస్వామి,గాలింకి రాంబాబు,చుక్కా నరసింహరావు,సూరిబోయన సూర్యనారాయణ,పదిలం సుబ్బారావు,జువ్వలపాలెపు అన్నవరం,కొనకళ్ళ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నల్లజర్ల: తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్స్ స్కూల్లో ప్రిన్సిపాల్ జానకీదేవి అధ్యక్షతన బుధవారం జరిగిన స్పోర్ట్స్ ఫెస్టివల్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలు, సృజనాత్మకతతో ముందుకు సాగాలన్నారు. బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటు పెంచుకోవాలని సూచించారు. ఓటమిని తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుని, సంపూర్ణ వ్యక్తిత్వం సాధించాలన్నారు. మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యంగా ఉండటానికి ఏదో ఒక క్రీడపై మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వీఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

నిడదవోలు రూరల్: పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కేవీ గణేష్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు చేతిరాత మెరుగు పర్చాలన్నారు. పరీక్షలంటే భయం వీడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గురుమూర్తి, హెచ్ఎంలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరు ఆవుచోరీ

రాజమహేంద్రవరం రూరల్: తమ గోశాలలోని పుంగనూరు ఆవును కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బుచ్చయ్య నగర్‌కు చెందిన కోరుపల్లి వెంకటరావు బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్సై కనకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.